# కుప్పం రైల్వేస్టేషన్ల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

## రైల్వే డివిజనల్ మేనేజరుకు ప్రతిపక్ష నేత చంద్రబాబు లేఖ



కుప్పం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త

కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న కుప్పం, మల్లానూరు, గుడుపల్లె రైల్వే స్టేషన్ల అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు దక్షిణపశ్చిమ రైల్వే డివిజనల్ మేనేజరుకు లేఖ రాశారు. కుప్పంనుంచి బెంగళూరుకు ఉదయం 8గంటలకు అదనపు పుష్‌పుల్ రైలు నడపాలని కోరారు.అలాగే కుప్పం రైల్వే స్టేషన్‌లో ప్రజల సౌకర్యార్థం స్కైవాక్ నిర్మించాలని లేఖలో పేర్కొన్నారు. గుడుపల్లె రైల్వే స్టేషన్‌లో కొత్త వెయిటింగ్ హాల్ నిర్మించాలని అలాగే ఫ్లాట్‌ఫామ్‌లలో ప్రయాణీకుల సౌకర్యార్థం కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. గుడుపల్లె రైల్వేస్టేషన్‌లో ప్రయాణీకులకోసం షెల్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. గుడుపల్లె, మల్లానూరు రైల్వే స్టేషన్లలో ప్రయాణీకుల సౌకర్యార్థం మంచినీటి వసతి కల్పించాలని పేర్కొన్నారు. కుప్పం ప్రాంతం వాణిజ్య, విద్యాకేంద్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు, ప్రయాణీకుల సౌకర్యార్థం తగు వసతులు సమకూర్చాలని లేఖలో పేర్కొన్నారు.


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త






# కళ్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

## వైభవంగా ఆలయ అలంకరణలు





చంద్రగిరి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:

శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు బుధవారం సాయంత్రం ఆలయంలో ఆగమోక్తంగా అంకురార్పణ గావించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల అర్చనాధి సేవలను, నిత్య కైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల మధ్యన ఆలయంలో మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, పుణ్యావచనం, రక్షాబంధం, విశ్వక్సేన ఆరాధన, విశేష పూజలు జరిపించారు. ఆలయంలో పుట్టమన్నును సేకరించి, నవధాన్యాలను నవపాలికలలో నింపి సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ అంకురార్పణ గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఇఓ యం.గోపినాధ్, సూపరింటెండెంట్ తేనెపల్లి వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, ఆలయ అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

### నేడు ధ్వజారోహణం

కళ్యాణ వెంకన్న ఆలయంలో గురువారం ఉదయం 8.40 గంటలకు శ్రీ కళ్యాణ వెంకటేశ్వం స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణ ం నిర్వహించనున్నారు. అదేవిధంగా సాయంత్రం 6 గటంల నుండి 7 గంటల వరకు స్వామివారు శ్రీదేవి భూదేవి సమేతుడై ఊంజల్ నందు సేదదీరనున్నారు. రాత్రి 8 గంటల నుండి 9 గంటల వరకు దేవదేవుడు పెద్దశేషవాహనంపై భక్తులకు దర్శనమిస్తారు.

# శివరాత్రికి శ్రీకాళహస్తీశ్వరాలయం ముస్తాబు








ఆలయంలో రంగవల్లులు, శ్రీ-కాళ-హస్తిలకు రంగులద్దుతున్న దృశ్యం, ఓంకారనాధానికి కొత్తశోభ

మార్చి 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రికి శ్రీకాళహస్తీశ్వరాలయం చక్కగా ముస్తాబవుతోంది. ఇప్పటికే ఆలయంలో చక్కని రంగవల్లులతో తీర్చిదిద్దుతున్నారు. ఇక ఆలయం పరిపాలన భవనం ఎదుట ఉన్న త్రినేత్ర అతిధిగృహం వద్ద ఉన్న శ్రీ-కాళ-హస్తిలకు కొత్తరంగులద్దుతున్నారు. ఇక ఓంకారనాధానికి కొత్తసొబగులు సంతరించుకుంది. ఆలయంలో వెలసిన గోపురాలకు సరికొత్త రంగులదద్దడంతో కొత్తదనం చోటుచేసుకుంది.

శ్రీకాళహస్తి, ప్రభాతవార్త

### రైతుల బ్యాంకు ఖాతాల్లో

# రూ.46.31 కోట్లు జమ

## వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాల కింద రైతులకు రూ.7.5 కోట్లు

## వర్చువల్ విధానంలో బ్యాంకు ఖాతాల్లోకి జమ చేసిన సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి



చిత్తూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:

రైతు భరోసా, పిఎం కిసాన్ యోజన, వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాల పథకాల కింద సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం రైతుల బ్యాంకు ఖాతాల్లో ఐదవ ఏడాది ఈ ఏడాదిలో మూడవ విడతగా నగదు జమ చేశారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుండి జిల్లాకు చెందిన 2.31 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి 46.31 కోట్ల రూపాయలు, వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాల పథకం కింద జిల్లాలోని 26,961 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి 7.5 కోట్ల రూపాయలను జమ చేశారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ విధానం నిర్వహించిన ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ నుండి జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పి.రామచంద్రారెడ్డి, మేయర్ అముద, జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ రమ్య, జడ్పీ స్త్రీ శిశు సంక్షేమ స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ భారతి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### రైతన్నల ఖాతాల్లో

## వైఎస్ఆర్ రైతు భరోసా, పిఎం కిసాన్ జమ



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త

వైఎస్ఆర్ రైతు బరోసా, పిఎం కిసాన్ కింద వరుసగా ఐదో ఏడాది మూడవ విడత నగదు బదిలీ చేసే కార్యక్రమంను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ విధానంలో ప్రారంభించి బటన్ నొక్కి నేరుగా అర్హులైన రైతుల ఖాతాల్లోకి జమ చేసారని జిల్లాలో 180763 మంది భూ యజమాని రైతులకు, కౌలు, ఆర్ఓఎఫ్ఆర్ సాగు రైతులకు రూ. 36.29 కోట్ల లబ్ది, డా. వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాలు పథకం కింద రూ. 3.93 కోట్ల రూపాయిల లబ్ధి చేకూరిందని జిల్లా సంయుక్త కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయగా తిరుపతి జెసి, వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖ, సెరికల్చర్, అనుబంధ శాఖల అధికారులు, రైతులతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద రావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దశరథ రామిరెడ్డి, జిల్లా సెరికల్చర్ అధికారిణి గీతారాణి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కులశేఖర పట్టణంలో మరో రాకెట్ ప్రయోగ కేంద్రం

- శ్రీహరికోటకు పోటీ కానుందా - అక్కడ చిన్న రాకెట్లు మాత్రమే ప్రయోగిస్తారంటూ ప్రచారం
- వర్చువల్ మోడ్‌లో ప్రారంభించిన ప్రధాని - ప్రసంగించిన ఇస్రో ఛైర్మన్







తమిళనాడులోని కులశేఖరపట్టణంలో నింగికి ఎగురుతున్న సౌండింగ్ రాకెట్, ప్రయోగ వేదికకు తరలుతున్న ఆర్‌హెచ్ 200 రాకెట్, మరో రాకెట్ ప్రయోగ కేంద్రం ప్రారంభం తర్వాత మాట్లాడుతున్న సోమనాథ్

శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 28 ప్రభాతవార్త

అంతరిక్ష పరిశోధనలో మరిన్ని ఉపగ్రహాల ప్రయోగం కోసం భారత్ మరో రాకెట్ ప్రయోగ కేంద్రానికి శ్రీకారంచుట్టింది. ఇటీవల ఇస్రోతో పాటు ప్రైవేటు స్టార్టప్‌లు కూడా ఉపగ్రహాల నిర్మాణం చేయడం రాకెట్ల ప్రయోగాలకు శ్రీహరికోట కేంద్రాన్ని ఎంచుకోవడం వంటి కమర్షియల్ సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో చాలారోజుల నుంచి ప్రత్యామ్నాయ ప్రయోగ వేదిక కోసం ఎదురు చూస్తున్న ఇస్రో తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్టణాన్ని ఎంచుకుంది. అక్కడ స్థల సమీకరణ పూర్తియన తర్వాత కూడా పనులు జరగలేదు. అయితే ఇటీవల మారిన పరిస్థితులు ఎక్కువ ఉపగ్రహాల ప్రయోగం చేపట్టాల్సిన అవసరం ఉండటంతో కులశేఖరపట్టణంలో పనులు వేగవంతం చేయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా బుధవారం అక్కడ రాకెట్ ప్రయోగ కేంద్రాన్ని అధికారికంగా ప్రారంభించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ మంగళవారం రూ.18 కోట్ల విలువైన మూడు ఇస్రో ప్రధాన అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన తర్వాత ఆ మరునాడే కులశేఖరపట్టణం రాకెట్ ప్రయోగ కేంద్రాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించారు. తమిళనాడుకు తాము ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తుంచుకోవాలని ప్రధాని అంటూ కులశేఖరపట్టణాన్ని సకల హంగులతో ప్రత్యామ్నాయ రాకెట్ ప్రయోగ కేంద్రంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

### చిన్న రాకెట్ల కోసమే..

కులశేఖరపట్టణంలో కేవలం చిన్న రాకెట్ల కోసం మాత్రమే రాకెట్ ప్రయోగ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు గతంలో ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ షార్‌లోనే ప్రకటించి ఉన్నారు. 2,292 ఎకరాలను ఇక్కడ రాకెట్ ప్రయోగ కేంద్రానికి ఎంపిక చేశారు. రూ.985 కోట్లకు పైగా ఈ ప్రాజెక్టు కోసం వెచ్చించనున్నారు. ఏడాదికి 24 రాకెట్లను ఇక్కడ ప్రయోగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

### ఇది మూడో ప్రయోగ వేదిక

అందరూ అనుకుంటున్నట్లు కులశేఖరపట్టణం రెండో రాకెట్ ప్రయోగ వేదిక కాదు. భారత్ అంతరిక్ష పరిశోధనలో బుడిబుడి అడుగులు వేస్తున్న తరుణంలోనే 61 ఏళ్ల ముందు కేరళలోని తిరువనంతపురంలో తుంబా రాకెట్ ప్రయోగ కేంద్రం ఏర్పాటు చేసుకుంది. అక్కడ చిన్న ఉపగ్రహ ప్రయోగాలు కూడా జరిగాయి. ఆ తర్వాత దానికన్నా అనువైన శ్రీహరికోటను ఎంపిక చేసుకున్నారు. ప్రస్తుతం శ్రీహరికోటలో మాత్రమే మొదటి, రెండవ ప్రయోగ వేదికల ద్వారా రాకెట్ ప్రయోగాలు చేపడుతున్నారు. ఆ విధంగా చూసినా కులశేఖరపట్టణంలో మూడు లేదా నాలుగవ రాకెట్ ప్రయోగ కేంద్రం ఏర్పాటు కానుంది. ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ బుధవారం కులశేఖరపట్టణం వద్ద మాట్లాడుతూ ఇక్కడ అన్ని సౌకర్యాలు సమకూర్చుకునే దిశలో ఇస్రో పనిచేస్తుందని చెప్పారు.

# జిడి నెల్లూరుకు ముచ్చటగా మూడో అభ్యర్థి

## వైకాపా అభ్యర్థిగా కృపాలక్ష్మి



చిత్తూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త

గంగాధర నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా అభ్యర్థిగా అధిష్టానం ముచ్చటగా మూడో అభ్యర్థి కృపాలక్ష్మిని ఖరారు చేసింది. వైకాపా అధిష్టానం మొదటి జాబితాలో జిడినెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్తగా చిత్తూరు ఎంపిన రెడ్డెప్పను ఖరారు చేసింది. అలాగే డిప్యూటీసిఎం, ప్రస్తుత జిడినెల్లూరు ఎమ్మెల్యే నారాయణస్వామిని చిత్తూరు ఎంపి అభ్యర్థిగా ప్రకటించింది. నారాయణస్వామి స్థానం జిడినెల్లూరు నుంచే మరోసారి పోటీచేస్తానని, తనకు అభ్యర్తిత్వం ఖరారుచేయాలని సిఎం జగన్‌ను కలసి విన్నవించారు. మళ్లీ డిప్యూటీ సిఎం నారాయణస్వామిని జిడినెల్లూరు అభ్యర్థిగా ఖరారుచేసింది. అయితే నియోజకవర్గంలోని డిప్యూటీ సిఎం వ్యతిరేక వర్గం ఆయన అభ్యర్థిత్వం ఖరారుచేస్తే తామే ఓడిస్తామని వైకాపా అధిష్టానానికి అల్టిమేటం జారీ చేశారు. ఈ మేరకు తర్జన భర్జనలు పడి వైకాపా అధిష్టానం నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మికి అభ్యర్థిత్వం ఖరారుచేసింది.

# పరుగులు తీస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు

## మంత్రి పెద్దిరెడ్డి



సదుం ఫిబ్రవరి 28 ప్రభాతవార్త

మండల పరిదిలో అభివృద్ధి కార్యక్రమాలు పరుగులు తీస్తున్నాయని రాష్ట్ర అట వీ విద్యుత్, పర్యావరణ, భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అ న్నారు. బుదవారం ఆయన మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిం చారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. మండలంలోని ఊటుపల్లె, తాటిగుంటపాలెం, జోగివారిపల్లె, తిమ్మానాయనపల్లెల్లో ఒక్కొక్కటి రూ.3 కోట్లతోనిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్లు ఆయన ప్రారంభించారు. అదేవిధంగా కంభంవారిపల్లె, చింతపర్తివారిపల్లె, అమ్మగారిపల్లె ల వద్ద యంపి నిధులు రూ.3లక్షలత చొప్పున నిర్మించిన మూడు బస్ షెల్టర్లను తాటిగుంటపాలెంలో రూ.5లక్షలతో నిర్మించిన ఆర్ఓ ప్లాంట్‌ను వైకాపా నాయకులు కువైట్‌హరినాధరెడ్డి, రమనారెడ్డి,వరలక్ష్మిలచేత రిబ్బన్ కత్తిరింపచేసారు. అదేవిధంగా బీసీ వెల్ఫేర్ కింద రూ.10లక్షలతో సదుం వద్ద నిర్మించిన ధోబీఘాట్‌ను,25 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను, భట్టువారిపల్లె వద్ద రూ.95లక్షలతో నిర్మించిన షాదీమహల్‌ను తిమ్మానాయనపల్లె రూ.23.94లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని,జోగివారిపల్లె, తిమ్మానాయనపల్లెల్లో వెల్‌నెస్ సెంటర్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమాల్లో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ కృష్ణారెడ్డి, జడ్పీసీఈఓ గ్లోరియా,బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, పిఆర్ఈఈ చంద్రశేఖరరెడ్డి, వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, డ్వామా ఏపీడీ శ్రీనివాసులు, బోయకొండ ఆలయకమిటీ సభ్యుడు భాస్కరరెడ్డి,ఎంపీడీఓ రాజశేఖర్‌బాబు, డీటీ కుమార్,ఎంఈఓ శ్రీరాములు, ఈఓఆర్డీ వరప్రసాద్, ఏపీఎం హరిప్రసాద్, కోఆప్షన్ మెంబర్ ఇమ్రాన్,వ్యవసాయాధికారి హరిప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు ధనంజయరెడ్డి,సింగిల్‌విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, సర్పంచిలు శ్రీనివాసులు రెడ్డి, మనోహరరెడ్డి, మురళీరెడ్డి,మల్లికార్జుననాయుడు, ఉషారాణి,ఎంపీటీసీలు స్వరూపా, మల్లికార్జున, మంగమ్మ, మండల వైకాపా కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీస్ కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, వైకాపా జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటస్వామి,డాక్టర్‌చరణ్,వాసు,డాక్టర్ ఇందాద్,కాజాపీర్,సయ్యద్‌భాషా, షబ్బీర్,కాలేషా,దామోదర,వాసు,జీవీ రమణ,గణేష్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పరిపాలనా కాలమంతా రహస్య సమావేశాలే!

## 33 అంశాల అజెండా ఆమోదం



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 28 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి రెండేళ్ళ పరిపాలనకాలంలో ధర్మకర్తల మండలి సమావేశాలు అతి కష్టం మీద నిర్వహించుకున్నారు. బుధవారం బహుశా ధర్మకర్తల మండలి సమూవేశం చివరిది కావచ్చు. ధర్మకర్తల మండలిని నియమిస్తూ ప్రభుత్వం ఫిబ్రవరి 28,2022లో జివో జారి చేసింది. ఆ జివో ఆధారంగా మార్చి 1న ఛైర్మెన్‌గా అంజూరు తారక శ్రీనివాసులు బాధ్యతలను గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద 'మహాశివరాత్రి పర్వదినాన' బాధ్యతలు స్వీకరించారు.మార్చి 2న సభ్యులు ప్రమాణ స్వీకారం చేసారు.కాబట్టి ధర్మకర్తల మండలి పదవి కాలం మరో రెండు రోజుల్లో ముగుస్తుంది.ఈ నేపథ్యంలో బుధవారం ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. 33 అంశాల అజెండాను ఆమోదించారు. గతంలో ధర్మకర్తల మండలి సమావేశాలంటే మీడియాను ఆహ్వానించే వారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ధర్మకర్తల మండలి సమావేశాలు, శాసనసభ్యుడునిర్వహించే కార్యక్రమాలు, ఆలయానికివచ్చే విఐపిల వివరాలు మీడియాకు అందించటం లేదు. గిరి ప్రదక్షిణం మార్గంలోని హర హర తీర్థంలో స్వామి అమ్మవార్ల పునఃనిర్మాణంలో నంది సింహ విగ్రహాల ఏర్పాటు,అర్థనారీశ్వరాలయంలో సప్తగోకులం ఏర్పాటు, వసంత మండపం,స్థపద మండపం,సప్త గోకులం ఏర్పాటు ఇటిసి సెంటర్ వద్ద ఖాళీ స్థలంలో కళ్యాణమండపం,రంగుల గోపురం వద్ద పంచముఖేశ్వరస్వామి ఆలయంలో బాలజ్ఞానాంబిక ఆలయం జీర్ణోద్ధారణ,సుబ్రమణ్యం స్వామి కొండ దిగువ మడపం,వినాయక ఆలయం నిర్మాణం,భరద్వాజతీర్థంలో బిల్వ వనం పరిశీలన,టిటిడిలా ఆశీర్వాదసేవను రూ.500ల టిక్కెట్టులో అనుమతి, ఇంజనీరింగ్ విభాగంలో 20సంవత్సరాలుగా పని చేస్తున్న 6గురికి డ్యూటీలు ఫిక్స్ చేయటం.దేవాలయంలో సేవలకు రెండు వంతెనలపైన్యూయాన్ లైట్లు ఏర్పాటు చేయటం. ప్రచార రథంతో పాటు రెండు ఉచిత బస్సులను ఏర్పాటుకు అంజూరు వారి మండపం వద్ద శివలింగం,నంది విగ్రహాన్ని ఏర్పాటు చేయుట ఇలా 33 అంశాలను పొందుపరచారు. వాటిలో కొన్నింటిని పరిశీలనకు మరి కొన్ని ఆమోదించారు.ఈ సమావేశంలో ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులుతో పాటు ఇఓ వి.యస్ నాగేశ్వరరావు సభ్యులు మున్నారాయల్, జయశ్యాం, సుమతి,కొండూరు సునిత,లక్ష్మి,నీల,చెంచులత,మల్లికార్జున్‌రెడ్డి,ఎఇఓలు లోకేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి,శ్రీహరి,విజయసారధి, ఇంజనీరింగ్‌శాఖ అధికారులు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ మద్యం తరలిస్తూ

# జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు అరెస్టు



పలమనేరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:

కర్నాటక నుండి అక్రమ మద్యంను రవాణా చేస్తూ జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు (తెలుగుదేశం), బంగారుపాళ్యం మండలం గొల్లపల్లి పంచాయతీ సర్పంచ్ కోకా ప్రకాష్ నాయుడు(57) పోలీసులకు పట్టుబడ్డాడు. అక్రమ మద్యం తరలిస్తున్న జిల్లా సర్పంచ్‌ల సం ఘ అధ్యక్షుడు కోకా ప్రకాష్‌నాయుడును పోలీసులు మంగళవారం రాత్రి 9 గంటలకు బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిలో పలమనేరు మండలం కేటల్‌ఫామ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పట్టుకొన్నారు. పలమనేరు డిఎస్పీ సి.మహేశ్వర్‌రెడ్డి విలేకరులతో ఈ కేసు వివరాలు బుధవారం వెల్లడిస్తూ పోలీసులకు ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో కర్నాటక నుండి అక్రమంగా వాహనంలో మద్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఈ మేరకు తన ఆధ్వర్యంలో పలమనేరు అర్బన్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్, ఎస్ఐలు శివశంకర్, సహదేవిలు సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి 9 గంటలకు వెళ్ళి తనిఖీలు చేశామన్నారు. ఈ క్రమంలో ఒక వాహనంలో మద్యం తీసుకువస్తు ఓ వ్యక్తి పట్టుబడటంతో అతనిని విచారిస్తే బంగారుపాళ్యం మండలంకు గొల్లపల్లి గ్రామంకు చెందిన సర్పంచ్ కె.ప్రకాష్‌నాయుడుగా తేలిందన్నారు.

# తాడేపల్లె గూడెంలో గణనాధుని కళ్యాణోత్సవం





కాణిపాకం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం, దేవాదాయ, ధర్మాదాయ శాఖ, ధర్మప్రచార పరిషత్‌ల ఆధ్వర్యంలో తాడేపల్లె గూడెంలో గణపతిహోమం, సంకటహర గణపతివ్రతం, సాయంత్రం కళ్యాణోత్సవం కార్యక్రమాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు.ప్రచారమహోత్సవాల్లో భాగంగా తాడేపల్లెగూడెంలోని శ్రీబలుసులమ్మ దేవస్థానంలో ఈ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా అత్యంత ఘనంగా నిర్వహించారు.అలంకరించినస్వామిఅమ్మవారి ఉత్సవమూర్తులను దేవస్థా నంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్దకు మంగళవాయిద్యాల నడుమ తీసుకువచ్చారు. అనంతరం వేదపం డితుల మంత్రోచ్చారణ నడుమ గణపతి హోమం, సంకటహర చతుర్థివ్రతం నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారి కళ్యాణోత్సవంను కన్నుల పండువగా నిర్వహించారు. ఈకార్యక్రమాలకు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సతీసమేతంగా విచ్చేశారు.

# తిరుపతి డివిజన్

## వైభవంగా సంకటహార చతుర్థి

**పుత్తూరురూరల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని బెస్తవీధిలో వెలసి ఉన్న శ్రీ తరుణ గణపతి ఆలయంలో సంకట హర చతుర్థి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఉదయం ఆలయంలోని మూల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు అలంకరణలు చేశారు. అలాగే ప్రత్యేక పుష్పాలతో పూజలు చేశారు. సాయంత్రం ఆలయాల ఆవరణలో గణపతి హోమం, నవగ్రహ హోమం నవగ్రహ శాంతి మంత్ర పుష్పాలతో ప్రత్యేక హోమాలు చేశారు. అలాగే తొరూరు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో సంకటహార చతుర్థి సందర్భంగా స్వామివారికి విశేష పూజలు చేశారు. భక్తులు స్వామివారికి మంగళ హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

## ఘనంగా టైలర్స్‌దినోత్సవం

**పుత్తూరురూరల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలో జాతీయ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి, పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించిన టైలర్స్, స్థానిక మండి వీధిలోకేక్ కట్ చేసిసంబరాలు జరుపుకున్నారు. పుత్తూరు పట్టణంలోని స్థానిక అంబేడ్కర్ భవనంలో టైలర్స్ కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. మిగ్గ మహిళ వృద్ధాశ్రమంలో వృద్ధులకు స్వీట్లు పంచిపెట్టి వస్త్రదానం, అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో వ్యక్తులు హుందాగా కనపడాలంటే టైలర్స్ శ్రమ ఎంతో ఉందని, బట్టల సౌందర్యాలను వెలికితీసేది టైలర్స్ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ కో–ఆపరేటర్ సొసైటీ అధ్యక్షుడు భాస్కర్, మహిళా టైలర్స్ అధ్యక్షురాలు నాగరత్న, గణేష్, రాజేంద్ర, సూరి, వెంకటముని, చిన్నబ్బ, రజని, పుష్పలత, లక్ష్మి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలోని ఆటో టెండర్ రద్దు చేయాలి - సీఐటీయూ ధర్నా

**పుత్తూరురూరల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని ఆటో వర్కర్స్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కమిషనర్‌కి మున్సిపల్‌చైర్మన్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ ఈ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని తిరుపతి జిల్లాలో ఎక్కడ కూడా ఆటోలకు రుసుము వసూలు చేయడం లేదు. కార్పొరేషన్ మున్సి పాలిటీలో ఎక్కడ వసూలు చేయడం లేదని, మున్సిపల్ అధికారులు వసూలు చేయడం సరైనది కాదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రైవేటు బస్టాండ్ టెండర్‌లో ఆటో వాలకు మినహాయింపు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో వర్కర్స్ ఫైనాన్స్‌లు కట్టలేక పోలీసు ఫైన్‌లు కట్టలేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ మున్సిపల్ కమిషనర్ స్పందించి ఆటో టెండర్లను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు విజయ్, వెంకటేష్, యాసిన్ బాషా, రమేష్, రవి, హరిశ్చంద్ర, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అద్భుతంగా జాతీయ సైన్సు దినోత్సవ ప్రయోగశాలలు

**పుత్తూరురూరల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని స్వామివీధి శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్సు దినోత్సవం జరిగింది. విద్యార్థులు రకరకాల ప్రయోగ కేంద్రం, వైజ్ఞానిక రంగం అబ్బురపరిచేలా ఉపన్యాసాలు, మేధా సంపత్తి, పెంపొందించేలా క్విజ్, సైన్సు గేయాలు, సైన్సు గీతాలు, సర్ సీవీ రామన్ బయోగ్రఫీ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాఠశాల ఏజీఎం సురేష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ఏదో ఒక గొప్పతనాన్ని వెలికి తీయడమే మా శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం గొప్ప ఉద్దేశం అని తెలియజేశారు. వైజ్ఞానిక రంగంలో ప్రపంచ దేశాలు అబ్బురపరిచేలా అప్పటి ప్రయోగాలను చేసి రామన్ ఎఫెక్ట్ కనుగొన్న ఏకైక భారతీయుడు సర్ సీవీ రామన్ అని తెలియజేశారు. విద్యార్థులకు బహుమతులు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌శరవణ, కళావాలడీన్ మోహన్, సైన్సు ఉపాధ్యాయులు, తదితరఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలోని టైలర్స్‌కు అండగా ఉంటాం: చైర్మెన్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలో టైలర్స్‌డే 30వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యఅతిధిగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. టైలర్స్ భవనం వద్ద దినోత్సవ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టైలర్లు పట్టణంలో భారీ ప్రదర్శనలు జరిపారు. ఈ సందర్భంగా టైలర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు అంజూరుతారక శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకాళహస్తిలోని దర్జీలకు ఏదైనా సమస్య అంటే పరిష్కరించగల నాయకుడు మన శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా టైలర్స్ కాలనీలో ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా అన్నదానం జరిపారు. ర్యాలిలో కమిటి గౌరవాధ్యక్షులు సుబ్రమణ్యం, గౌరవ సలహాదారు షేక్. చాన్‌బాషా, శ్రీనివాసులు కమిటి సభ్యులు అశోక్, అమర్‌నాథ్, రాజా, సుధాకర్, సెల్వ, నాగేంద్ర, బత్తినయ్య, మల్లికార్జునయ్య, మునిలక్ష్మీ, రేవతి, సునీతసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## గోపాల పురంలో టిడిపిలో చేరిక



**శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు అధ్వర్యంలో గోపాలపురానికి చెందిన సుమారు వంద మంది బుధవారం వైకాపా నుంచి తెలుగ ుదేశంలో చేరినట్లు ప్రకటించారు. గ్రామానికి చెందిన విజయ కుమార్, బలరామయ్య, చంద్ర, రమణయ్య, వీరాస్వామి, సుబ్బయ్య, వెంకటేష్, రోశయ్య, శంకరయ్య, వెంకటయ్య, కాలేబు తదితరులు చేరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి, మండల నాయకులు చెంచయ్యనాయుడు, సతీష్, మణిల సారధ్యంలో పార్టీలో చేరారు.

## ఊరందూరులో జగనన్న ఆరోగ్యసురక్ష

శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో బుధవారం వైకాపా సారధ్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను మండల నాయకుడు మాజీ మార్కెటింగ్ కమిటి అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి సారధ్యంలో ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి అందించిన పథకాలు చరిత్రాత్మకం. ఆర్థికంగా కుటుంబాలను ఎదిగించటానికి ఓ వైపు ముఖ్యమంత్రి, మరో వైపు నియోజకవర్గ నాయకుడు బియ్యపుమ ధుసూధనరెడ్డి ఆదుకుంటున్నారని కృష్ణారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమాల్లో సచివాలయ కన్వీనర్ పైపు రంగయ్య, వయ్యాల మనోహర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పసల కృష్ణయ్య గ్రామ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి ఓ శాస్త్రవేత్తగా రాణించాలి..సుధీర్‌రెడ్డి

తొట్టంబేడు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త

ప్రతివిద్యార్థి ఓశాస్త్రవేత్తగా రాణించాలని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ధర్మరాజులగుడి



ఎదురుగా ఉన్న శ్రీచైతన్య పాఠశాల బ్రాంచి-3లో జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపల్‌రమణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిధిగా విచ్చేసిన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తయారుచేసిన వివిధ వైజ్ఞానిక ప్రదర్శనలను చూసి వారిని అభినందించారు కార్యక్రమంలో పాఠశాల డీన్ కేదార్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా జయరామరావువీధిలోని పెద్దకోనేరు వద్ద ఉన్న శ్రీచైతన్యపాఠశాలబ్రాంచి–1లోజాతీయసైన్సు దినోత్సవవేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా వైష్ణవి, శైలజ, పద్మప్రియలు విచ్చేసి విద్యార్థులు ప్రదర్శించిన ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులను అందించారు. ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ సుధాకర్లు పాల్గొన్నారు.

## తేదేపాలో చేరిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్

తొట్టంబేడు, ఫిబ్రవరి 28 ప్రభాతఆవర్త

త్వరలోనే రాష్ట్రంలో రాక్షసపాలనకు అంతమయ్యే రోజులు దగ్గరపడ్డాయని నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జలరిషితారెడ్డి అన్నారు. ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పెద్దకనపర్తి, చిన్నకనపర్తి, కొన్నలి గ్రామాల్లో ఆమె ఇంటింటికి పర్యటించారు. పెద్దకనపర్తి మాజీ సర్పంచ్ చలపతి, గ్రామస్తులు ఆమెను దుశ్శాలువతో సత్కరించారు. రానున్న ఎన్నికల్లో బొజ్జలసుధీర్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, జడ్పీటిసిలు అర్చనాదేవి, తిరుమలయ్య, మాజీ జడ్పీటిసి వెంకటాచలం, ప్రతాప్‌రెడ్డి, చెంచయ్యనా యుడు, ఈశ్వర్‌రెడ్డి , మునిరాజనాయుడు, శంకర్‌నాయుడు, రమాదేవి, ధనంజయులు, శేఖర్, బత్తెమ్మ, సుధ, వసంతరావు, సామ్రాజ్యం, విజయ్, రామచంద్రయ్య, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## లోకేష్‌ను కలిసిన ఐటిడిపి నేత గోపినాథ్

**పుత్తూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** చెన్నై శ్రీ పెరంబదూర్ ఆలయ పర్యటనకు విచ్చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను టిడిపి నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాశ్ సమక్షంలో ఐటిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జి.గోపినాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు నగరి నియోజకవర్గ ఐటిడిపి తరపున ఇప్పటి వరకూ చేసిన పార్టీ వివిధ రకాల ప్రచార కార్యక్రమాలు, ఎన్నికల ప్రచారానికి నిర్దేశించుకున్న ప్రణాళికను గోపినాథ్ వివరించారు. దీనికి లోకేష్ ఐటిడిపి పనితీరును అభినందిస్తూ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు అవిశ్రాంత కృషి చేయాలని సూచించారు.

## శ్రీవెంకటేశ్వర స్కూల్ వ్యవస్థాపకులు శ్రీధర్ కన్నుమూత

తిరుపతి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త



ప్రముఖ న్యాయవాది, శ్రీవెంకటేశ్వర స్కూల్ వ్యవస్థాపకులు, వేపంజేరి లక్ష్మీనారాయణస్వామి ఆలయ ధర్మకర్త కె.ఎస్.శ్రీధర్ (81) బుధవారం సాయంత్రం కన్నుమూశారు. ఆయన తిరుపతి నగరంలో ప్రముఖ న్యాయవాదిగా, విద్యాసంస్థల వ్యవస్థాపకుడిగా మంచిపేరు తెచ్చుకున్నారు. ఆధ్యాత్మిక పరంగా వారి ఇలవేల్పు అయిన వేపంజేరి లక్ష్మీనారాయణ స్వామి ఆలయ ధర్మకర్తగా విశేష సేవలు చేశారు. ఆయన అనారోగ్యంతో చెన్నైలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం జరుగుతాయని ఆయన కుమారుడు కె.ఎస్. వాసు తెలిపారు.

## ప్రపంచం విజ్ఞానంపై ఆధారపడి ఉంది - గ్లోరీదేవి ప్రియ




**రేణిగుంట, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** ప్రపంచం శాస్త్రజ్ఞులు రూపొందించిన విజ్ఞాన ఫలితంపై ఆధారపడి ఉందని అమరరాజా విద్యాలయం ప్రధానాచార్యులు గ్లోరీదేవి ప్రియ అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి అమరరాజా విద్యాలయంలో జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం విజ్ఞాన ప్రదర్శన జరిగింది. విద్యార్థులు తాము స్వయంగా తయారు చేసిన విజ్ఞాన రూపకాలను ప్రదర్శనలో ఉంచారు. రూపకాల ప్రయోజనాలను సందర్శకులకు వివరించారు. రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్న భారతదేశానికి చెందిన భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్‌ను స్మరించుకోవడానికి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న మొత్తం జాతీయ సైన్సు దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జయంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తపాలా శాఖ సేవలు సద్వినియోగం చేసుకోండి

**వడమాలపేట, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ పరిధిలోని తపాలాశాఖ అందజేస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ ఏఎస్పీ ఆర్ముగం కోరారు. డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం వడమాలపేటలో తపాలాశాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పతకాలను తపాలాశాఖ ద్వారా పొందవచ్చని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం వివిధ పథకాలు, సేవింగ్, బీమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు పాలసీ నగదు చెల్లించి బీమా చేయించుకున్నారు. ర్యాలీలో సబ్ పోస్టుమాస్టర్ కిషోర్, బ్రాంచి పోస్టుమాస్టర్ వెంకమరాజు, శేఖర్ ప్రసాద్, రమణ, భాస్కర్‌రాజు, దేవప్రసాద్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నాయకులకు భానుప్రకాష్ పరామర్శ



**వడమాలపేట, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** వడమాలపేట మండలంలోని పాదిరేడులో అనారోగ్యానికి గురైన టీడీపీ నాయకులను నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ బుధవారం పరామర్శించారు. ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్న ముని రత్నంనాయుడుని ప్రమాదంలో గాయపడిన సురేష్‌లను వారి ఇళ్ళకు వెళ్లి పరామర్శించి వివరాలను తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో టీడీపీ పాదిరేడు క్లస్టర్ ఇన్‌చార్జి ధనంజయులునాయుడు, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి దాముయాదవ్, అనంతసేన, చందు, బత్తినాయుడు, ఉదయ్‌యాదవ్, జగదీష్, విజేంద్రయ్య, మనోహర్, ప్రవీణ్, హేమంత్, చరణ్ ు పాల్గొన్నారు.

## తిమ్మసముద్రంలో వేగంగా సాగుతున్న గంగమ్మగుడి పనులు

**కేవీబీ పురం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** తిమ్మసముద్రం గ్రామంలో గంగమ్మగుడి నిర్మాణానికి శనివారం భూమిపూజ చేసిన విషయం అందరికి తెలిసిందే. అయితే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గుడిని దగ్గరుండి పూర్తి చేస్తానని హామీ ఇచ్చిన సర్పంచ్ దొరబాబునాయుడు గుడి పనులను పర్యవేక్షించి పనులు చేపడుతున్నారు.

## నిస్వార్ధ నాయకుడికి ఒక్క అవకాశం ఇవ్వండి..!

చంద్రగిరి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:



నీతి నిజాయితీ కలిగిన నిస్వార్ధ నాయకుడు టిడిపి ఎంఎల్‌ఏ అభ్యర్థి పులివర్తి నానికి ఒక్కసారి అవకాశం ఇవ్వండని టిడిపి యువజన నాయకుడు పులివర్తి వినీల్ ప్రజలను కోరారు. మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం బుధవారం రామిరెడ్డిపల్లి పంచాయతీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో 30 ఏళ్ళు వెనక్కి నెట్టివేయబడిన నియోజకవర్గాన్ని గాడిలో పెట్టాలంటే పులివర్తి నానికి ఓటు వేయాలని కోరారు. వైసిపి నాయకులు ఓటమి భయంతో దొడ్డిదారిలో గెలిచేందుకు విశ్వయత్నాలు చేస్తున్నట్లు విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ, టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, సక్కుర్ ధనంజయ రెడ్డి, సజ్జా పురుషోత్త నాయుడు, రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, గ్యాస్ నాగరాజ, తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపధికన ఎంపిడిఓ కార్యాలయ భవన నిర్మాణం

### రూ.90 లక్షలు తుడా నిధులతో మండల పరిషత్ భవనం, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి శంకుస్థాపన



**చంద్రగిరి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** ఆధునిక సౌకర్యాలతో సర్వాంగ సుందరంగా ఎంపిడిఓ కార్యాలయాన్ని యుద్ధప్రాతిపధికన నిర్మించాలని తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. స్థానిక పాత మండల పరిషత్ ఆవరణలో బుధవారం ఆయన ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తల సమక్షంలో శిలాఫకానికి పూజలు నిర్వహించి శంకుస్థాపన గావించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.90 లక్షలు తుడా నిధులతో మండల పరిషత్ కార్యాలయాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమమైనా ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నాయకత్వంలోనే జరిగిందని అన్నారు. ఆయన అడుగుజాడల్లో నడచి మరింత అభివృద్ధికై పనిచేయనున్నట్లు తెలిపారు. ఎళ్ళ వేళలా మీ ఆశీఆస్సులు అందించాలని కోరారు.

## సర్ సి.వి.రామన్ ప్రతిభకు పురస్కారమే "సైన్స్ డే"

ఎంఈఓ శ్రీవరం లితకుమారి



**చంద్రగిరి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** భారతీయ శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్ ప్రతిభకు పురస్కారమే జాతీయ విజ్ఞాన దినోత్సవం (సైన్స్ డే) అని ఎంఈఓ శ్రీవరం లలితకుమారి అన్నారు. జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని ప్రాధమిక, ఉన్నత పాఠశాలలలో విద్యార్ధినులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, ఎంఈఓ-2 భాస్కర్ బాబు చంద్రగిరి శ్రీ పద్మావతీ బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శనలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 1928 ఫిబ్రవరి 28న భారతీయ శాస్త్రవేత్త చంద్రశేఖర్ వెంకటరామన్ (సర్ సి.వి.రామన్) ఒక వినూత్న, విజ్ఞాన శాస్త్ర ప్రయోగ ఫలితాన్ని ప్రపంచానికి అందజేశారన్నారు. ఈ దృగ్విషయాన్ని సర్.సి.వి.రామన్ ఫిబ్రవరి 28న వెలుగులోకి తీసుకురావడంతో ఈ రోజును జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవం రోజుగా ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు. అదేవిధంగా 'రామన్స్ డే' అనికూడా అంటారన్నారు. సైన్స్ టీచర్లు కోదండపాణి, లతాదేవి సంయుక్త పర్యవేక్షణలో విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలను తిలకించి అబ్బురపడిన ఆమె విద్యార్థులువివరించిన తీరుకు ముగ్దులై బహుమతులు అందజేసి అభినందించారు.

## పరిశ్రమల స్థాపన,

### ఉద్యోగ అవకాశాలపై సిఐఐ చర్చ

### - తిరుపతి జోన్ నూతన అధ్యక్షుడుగా పుష్పిత్‌గార్గ్




**తిరుపతి, ఫిబ్రవరి 28ప్రభాతవార్త:** స్మార్ట్‌సిటీ తిరుపతి నగరం మరింతగా పారిశ్రామికంగా పురోగతి సాధించేందుకు సిఐఐ ,పారిశ్రామిక వేత్తలు కృషి సహకారం అవసరమని సిఐఐ ప్రతినిధుల సమావేశం తీర్మానించింది. బుధవారం ఉదయం తిరుపతిలోని ఓ హోటల్‌లో సిఐఐ రాష్ట్రస్థాయి ప్రతినిధుల సమావేశం జరిగింది. సిఐఐ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎం.లక్ష్మీప్రసాద్ నేతృత్వంలో ఏర్పాటైన ఈ సదస్సులో తిరుపతి జోన్ అధ్యక్షుడుగా పుష్పిత్‌స్టీల్స్ ప్రైవేట్‌లిమిటెడ్ డైరెక్టర్ పుష్పిత్‌గార్గ్, ఉపాధ్యక్షుడుగా ఓ.జగన్నాథ్ ఎంపికయ్యారు.

## సాయిసుధ కంటి ఆస్పత్రిలో నేడు ఉచిత వైద్యశిబిరం

తిరుపతిహెల్త్, ఫిబ్రవరి 28ప్రభాతవార్త:



తిరుపతి తిలక్‌రోడ్డులో ఉన్న సాయిసుధ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి అధినేత్రి డాక్టర్ రాళ్ళపల్లి సుధారాణి తెలిపారు. నేటి ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు సాయిసుధ కంటి ఆస్పత్రిలో అన్ని వైద్యపరీక్షలు నిర్వహిస్తామన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్డుద్వారా శుక్లాలు ఉన్న వారికి ఉచిత ఆపరేషన్ చేయబడుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## శిరుగురాజుపాళెం పంచాయతీలో బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ

**పుత్తూరురూరల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:**



పుత్తూరు రూరల్ మండలం శిరుగురాజుపాళెం పంచాయతీలో టీడీపీ పుత్తూరు రూరల్, క్లస్టర్ ఇన్‌చార్జి గంజిమాధవయ్య ఆధ్వర్యంలో బాబు షూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్‌ని ఎమ్మెల్యేగా గెలిపిస్తే యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ అభివృద్ధి చేసిచూపిస్తారన్నారు. అలాగే వైసీపీ నాయకులు టీడీపీ కండువ కప్పుకుని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం బాబు షూరిటీ–భవిష్యత్ గ్యారెంటీ గోడపత్రికలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు పద్మనాభం(బాబు), టీడీపీ నాయకులు కరుణ, రవి, కిరణ్, బాలాజీ, యువత పాల్గొన్నారు.

## ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు

**ఏర్పేడు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త;** మండలంలోని ముసలిపేడు గ్రామంలో రాస్ మరియు టాటా ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో బుధవారం పిక్ బస్సు ద్వారా ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా రాస్ మహిళా భారతి ఫీల్డ్ అధికారి వెంకట కుమార్ మాట్లాడుతూ 30 నుంచి 65 ఏళ్ల లోపు వయస్కులు ప్రతి ఒక్కరు ప్రతి 6నెలల కొకసారి వైద్య ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ సర్పంచి ప్రభాకర్‌రెడ్డి, క్లస్టర్ లీడర్ దేవకమ్మ, కుమారమ్మ, రత్నమ్మ, జయలక్ష్మిలు మాట్లాడుతూ రాస్ సేవా కార్యక్రమాలు మండలంలోని ఏదో ఒక గ్రామంలో నిత్యం చేస్తున్నట్లు తెలిపారు, ఈకార్యక్రమంలో రాస్ అప్పుల విభాగం మునీంద్ర, అనిమేటరు కృష్ణవేణి, ఆఫీస్ అసిస్టెంట్ తిరుపాలు, టాటా ట్రస్ట్ సిబ్బంది, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ పివి హేమంత్ కుమార్, డాక్టర్ వెంకయ్య బాబు, డెంటల్ టాటా ట్రస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైలు పట్టాలపై గుర్తు తెలియని యువకుడు మృతి

**ఏర్పేడు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త;** మండల కేంద్రమైన ఏర్పేడు సమీపంలోని రైలు పట్టాలపై ఓ గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం కలకలం చోటు చేసుకుంది. ఈ విషయమై రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్సై రవి, హెడ్‌కానిస్టేబుల్ నరసింహుల్ సమాచారం మేరకు బుధవారం ఉదయం 9గంటలకు రైలు పట్టాలపై మృతదేహం పడి ఉందని సమాచారం తెలియడంతో వెళ్లి పరిశీలించగా సుమారు 30సంవత్సరాల వయసున్న ఓ గుర్తు తెలియని యువకుడు బ్లూరంగు జీన్స్ ప్యాంట్, నీలిరంగు టిసర్ట్ ధరించి రేణిగుంట, శ్రీకాళహస్తి రైల్వే లైన్‌లో ఏర్పేడు రైల్వే గేటుకు వ్యాసాశ్రమం మధ్యన యువకుడు మృతి చెందినట్లు గుర్తించామన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ హాస్పిటల్‌కి తరలించి కేసు నమోదు చేసి ధర్యాప్తులో మృతుడిది అత్యా, ఆత్మహత్యా అనే విషయాలు తెలియాల్సి ఉందన్నారు.

## మోదుగులపాళెంలో టిడిపి నుంచి వైసిపిలోకి వలసల జోరు



**ఏర్పేడు, ఫిబ్రవరి28, ప్రభాతవార్త;** మండలంలోని మోదుగులపాళెం గ్రామంలో బుధవారం టిడిపి నుంచి వైసిపిలోకి వలసల జోరు పెరిగింది. శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తనయ బియ్యపు పవిత్రరెడ్డి, మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు టిడిపి నుంచి వైసిపిలోకి చేరారు. ఈకార్యక్రమంలో చంద్రశేఖర్‌ఆచ్చారి, తొండమనాటి మురళి, చంద్రమ్మ, సుందరయ్య యాదవ్, గాలి గుణశేఖర్‌నాయుడు, శేఖర్‌రెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, మడిబాక రవిరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు,

## ఐఐటి తిరుపతిలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు

**ఏర్పేడు, ఫిబ్రవరి28, ప్రభాతవార్త;** మండల కేంద్రమైన ఏర్పేడు సమీపంలో వెలసిన ఐఐటి తిరుపతిలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా ఐఐటి నిపుణులు అధ్యాపకులు, సైన్స్‌పట్ల మక్కువ ఉన్న యువకులను ఒకచోట చేర్చి ఉత్సాహభరితమైన వేడుకలను నిర్వహించింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా శివనాడార్ యూనివర్సిటి మాజీ వైస్ చాన్సలర్ మరియు న్యూఢిల్లీ లోని జేఎన్‌యు నుండి ప్రఖ్యాత ప్రొఫెసర్ రామంజరి ఘోష్ స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేశారు. సెలబ్రేషన్ ఆఫ్ సైన్స్ విత్ క్వాంటం మిరాకిల్స్ అనే థీమ్ చుట్టూ ఆమె ప్రసంగం కొనసాగింది. అదేవిదంగా ఫిజిక్స్ మరియు కెమిస్ట్రీ విభాగాల శాస్త్రీయ సూత్రాలను చర్యల్లో ప్రదర్శించడానికి ఆకర్షనీయమైన ప్రయోగాలను నిర్వహించాయి. ఈకార్యక్రమంలో డాక్టర్ గౌరీ ప్రసన్నరాయ్, డాక్టర్ రితేష గంగ్వార్, ఎన్ ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మహేష్ కుమార్ తదితర ఐఐటి సిబ్బంది పాల్గొన్నారు.

## వనరాజ కోళ్ళు పంపిణి

**ఏర్పేడు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త;** మండలంలోని మన్నసముద్రం గ్రామంలో ఎస్వీయు పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏఐసిఆర్పీ వారు ఎస్సీ పాడి రైతులకు 30 యూనిట్ల వనరాజ కోడి పిల్లలను బుధవారం పంపిణీ చేశారు. ఒక యూనిట్ విలువ రూ.4000 ఉంటుందని ఎంపీ గురుమూర్తి ఆదేశాల మేరకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మెన్ నాగార్జున్‌రెడ్డి, ఏడి డాక్టర్ సునీత, ఏర్పేడు పశువైద్యాధికారిణి శిల్పారెడ్డి, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విశ్వం స్కూల్‌లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

### ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి

తిరుపతి క్రీడ, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త



తిరుపతి స్థానిక జీవకోనలోని విశ్వం హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వం విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సుమారు 100 ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించిన ఈ ఎగ్జిబిషన్‌లో వేస్ట్ మేనేజ్మెంట్ సిస్టమ్స్, సోలార్ ఎనర్జీ, లేజర్ సెక్యూరిటీ అలారం తదితర ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి హాజరై విశ్వం విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ఎక్స్‌పెరిమెంట్స్‌ను పరిశీలించి వారిని అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథ్ రెడ్డి, విశ్వం స్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ ఎన్. విశ్వ చందన్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్ధులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

## పసుపులేటి వసుధకు ఎస్వీయూ డాక్టరేట్



**తిరుపతి మహిళావర్శిటీ, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** ఎస్వీయూ మనస్తత్వశాస్త్రం విభాగం పరిశోధక విద్యార్థిని పసుపులేటి వసుధకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్శిటీ పరీక్షల నియంత్రణ అధికారి దామ్లా నాయక్ తెలిపారు. మనస్తత్వ శాస్త్ర విభాగం ఆచార్యులు, ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య వి. శ్రీకాంత్ రెడ్డి మార్గదర్శకత్వములో స్ట్రెస్, సోషల్ సపోర్ట్ అండ్ సైకలాజికల్ వెల్ బీయింగ్ అమాంగ్ ఎల్డర్లీ అను అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. వసుధ పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్‌లలో అనేక పరిశోధనా పత్రాలను ప్రచురించారు. పసుపులేటి వసుధకు డాక్టరేట్ డిగ్రీ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు పరిశోధకులు బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

## జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమానికి విశేష స్పందన



**నారాయణవనం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని నారాయణవనం బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమంకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. పలువురు విద్యార్థుల చేత తయారు చేసిన సైన్స్ ప్రదర్శనను ఎంఇఓ–2 గోవిందస్వామి, బాలుర ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్ సులోచన, సైన్స్ ఉపాధ్యాయులు ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనను అన్ని తరగతులకు చెందిన విద్యార్థులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు సురేష్‌బాబు, శ్రీనివాసులు, వెంకటరమణ, రమేష్, ఓసైమల్లి, ధనలక్ష్మీ, పిడి జయప్రకాష్, సదాశివం, విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## యువకులు భావితరాలకు ఆదర్శంగా ఉండాలి

రేణిగుంట, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:



చదువుకున్న యువకులు భావితరాలకు ఆదర్శంగా ఉండాలని యువనేత, సురేష్ ఫుడ్ బేవరేజేస్ డైరెక్టర్ రొమ్మాల రాజేష్‌రెడ్డి అన్నారు. రేణిగుంట మండలం కొత్త మంగళంకు చెందిన యువనేత, పారిశ్రామికవేత్త రొమ్మాల రాజేష్‌రెడ్డి జన్మదిన వేడుకలు సురేష్ ఫుడ్ బేవరేజస్ కంపెనీలో ఘనంగా బుధవారం జరిగాయి. రాజేష్‌రెడ్డి ముందుగా కేక్ కట్ చేసి అందరికి పంచారు. పేదలకు బట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లాలిత్య, సురేష్‌రెడ్డి, జోష్ణరెడ్డి, దివ్య, రేష్మిక, మౌష్విక్, కంపెనీ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

## డిగ్రీ కాలేజీలో ఘనంగా సైన్స్ దినోత్సవ వేడుకలు

పుత్తూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :



విజ్ఞాన శాస్త్రం మానవుల అభివృద్ధికి అనేక విధాలా తోడ్పడుతుందని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి అన్నారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను కాలేజీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోబెల్ బహుమతి గ్రహీత సర్ సి.వి.రామన్ కాంతి విక్షేపణ సిద్ధాంతాన్ని కనుగొన్న రోజును దేశ వ్యాప్తంగా జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ సి.వి.రామన్ భౌతిక శాస్త్రంలో చేసిన అపార సేవలను కొనియాడారు. అనంతరం సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వీరయ్య, అధ్యాపకులు డాక్టర్ హరిబాబు, డాక్టర్ శ్యామ్‌సన్ రాజు, డాక్టర్ సుజన, ఎస్.పద్మావతి, డాక్టర్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

